క్లుప్తంగా

బందరు డీఎల్‌పీవోగా మొహమ్మద్ రజావుల్లా



చిలకలపూడి(మచిలీపట్నం): డివిజనల్ పంచాయతీ అధికారిగా మొహమ్మద్ రజావుల్లా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ డీఎల్‌పీవోగా జిల్లా పంచాయతీ కార్యాలయ ఏవో కె. సీతారామయ్య విధులు నిర్వహించారు. ఈ స్థానంలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవోగా పనిచేస్తున్న మొహమ్మద్ రజావుల్లాను మచిలీపట్నం డీఎల్‌పీవోగా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన కలెక్టర్ బాలాజీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి అనంతరం బాధ్యతలు స్వీకరించారు.

గురుకులంలో ప్రవేశాలు

పెడన: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి సీట్లు పొందిన వారికి అడ్మిషన్లు జరుగుతున్నట్లు బల్లిపర్రు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రూతమ్మ తెలిపారు. సోమవారం గురుకులంలో అడ్మిషన్లను పరిశీలించిన ఆమె మీడియాతో మాట్లాడుతూ ఐదో తరగతిలో 40 మందికిపైగా చేరారన్నారు. ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్‌కు సంబంధించి 62 సీట్లకు 57 భర్తీ అయ్యాయన్నారు. సెకండ్ లిస్ట్ విడుదలవ్వగానే మిగిలిన సీట్లు కూడా భర్తీ అవుతాయని పేర్కొన్నారు. ఇంటర్మీడి యెట్ లో ఎంఈసీ, సీఈసీ మాత్రమే ఉన్నట్లు తెలిపారు.

గూడూరు పశువైద్యాధికారిగా అల్తాఫ్ హుస్సేన్



గూడూరు: స్థానిక వెటర్నరీ డిస్పెన్సరీ పశు వైద్యాధికారిగా డాక్టర్ మీర్ అల్తాఫ్ హుస్సేన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా మీర్ అల్తాఫ్ హుస్సేన్ నందమూరు నుంచి గూడూరుకు బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ బి.విజయ్‌కుమార్ భట్లపెనుమర్రుకు బదిలీ అయ్యారు.

ఆర్థిక సాయం



గూడూరు: ఆకులమన్నాడు వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త దగాని వెంకటేశ్వరరావు కుటుంబానికి సోమవారం మండల వైఎస్సార్ సీపీ ఆర్థిక సహాయం అందజేసింది. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ పదిరోజుల క్రితం మరణించారు. విషయం తెలుసుకున్న పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఉప్పాల రాము ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట జయవర్ధన్, ఉపాధ్యక్షులు రాయన శ్రీహరి, బత్తిన నరసింహస్వామి, ప్రధాన కార్యదర్శి ఎజ్జు వెంకయ్య, జిల్లా కార్యదర్శి పిండి వెంకన్న, గూడూరు మండల కోఆప్షన్ సభ్యుడు కరీముల్లాలు వెంకటేశ్వరరావు భార్య రజనికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఏవో మురళీకృష్ణకు సత్కారం

ఘంటసాలపాలెం(ఘంటసాల): మండలం ఘంటసాలపాలెం గ్రామానికి చెందిన రైతులు గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఘంటసాల నుంచి చల్లపల్లికి బదిలీ అయిన ఏవో మురళీ కృష్ణను సోమవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఏవో మురళీ కృష్ణ సేవలను కొనియాడారు. అనంతరం దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని అందించారు. రైతులు వేమూరి సాయి వెంకటరమణ, ఉప్పల ప్రసాదరావు, మూల్పూరి వెంకయ్య, దోనె వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బోలెం అర్జునరావు, వీఆర్వో వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, పాపారావు, రైతులు పాల్గొన్నారు.

డ్వాక్రా ఆడిట్ ప్రారంభం

పెడన: పురపాలక సంఘ పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలో నడుస్తున్న డ్వాక్రా సంఘాల ఆడిట్ సోమవారం నుంచి ప్రారంభమైంది. ఆజాద్ ఆడిట్ సంస్థ నుంచి ఆడిట్ ఎగ్జిక్యూటీవ్ అధికారి భువన్‌తేజ్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. పలు వార్డులకు సంబంధించి డ్వాక్రా సంఘాలకు చెందిన రిజిస్టర్ పుస్తకాలు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, సమాఖ్యలకు చెందిన రిజిస్టర్ పుస్తకాలను పరిశీలించి ఆడిట్‌ను పూర్తి చేస్తున్నారు. మెప్మా మిషన్ మేనేజర్ కేఎస్ ఆనందబాబు ఆడిట్ జరుగుతున్న విధానాన్ని, ఆర్పీలు రిజిస్టర్ పుస్తకాలు, బ్యాంకు స్టేట్‌మెంట్లు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు.

ఏవోగా పద్మజారాణి బాధ్యతల స్వీకరణ

ఘంటసాల: మండల ఏవోగా కె.పద్మజారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఘంటసాల ఏవోగా పని చేసిన కె.మురళీ కృష్ణ చల్లపల్లి మండలం వ్యవసాయ శాఖ అధికారిగా బదిలీపై వెళ్లారు. ఆయనస్థానంలో పద్మజారాణి బాధ్యతలు స్వీకరించారు. రైతులకు అందుబాటులో ఉంటూ మండలాన్ని ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తానన్నారు.

వేలిముద్రలు వేసేందుకు వేచిచూసి!

- పెడన ఏవో కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- అధికారులు, సిబ్బంది ఎవరూ రాని దుస్థితి
- వేచి చూసి వెనుదిరుగుతున్న వైనం
- ఈకేవైసీకి 20వ తేదీతో గడువు పూర్తి



పెడన ఏవో కార్యాలయం వద్ద రైతుల ఎదురుచూపులు

పెడన: రైతన్న తాను పండించే పంట కోసం పడే ఆగచాట్లు కంటే ఎన్డీయే కూటమి ప్రభుత్వం అందించే పథకం కోసం పడుతున్న పడిగాపులు వర్ణనాతీతం. అన్నదాత సుఖీభవ పథకం కోసం ఈకేవైసీ తప్పనిసరని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సేవాకేంద్రాల బాట పట్టారు. ఈ నెల 18వ తేదీతో గడువు ముగుస్తుందని చెబుతున్నారు.

పెడన ఏవో కార్యాలయం తీరే వేరు

పెడన మండలంలోని పెడన పట్టణానికి, మడక గ్రామానికి రైతు సేవా కేంద్రం ఉన్నా వీఏఏ లేకపోవడంతో రైతులు ఏవో కార్యాలయం వద్ద పడిగాపులు పడుతున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా తిరుగుతున్నా ఎవరూ తాళం తీయడం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. సోమవారం ఏవో కార్యాలయానికి మండలంలోని దేవరపల్లి, పెడన, తోటమూల, మడక గ్రామాలకు చెందిన రైతులతో పాటు పెడన మండలంలో పంట పొలాలుండి ఇతర ప్రాంతాల్లో ఉన్న రైతులు విజయవాడ, బంటుమిల్లి, సాతులూరు తదితర ప్రాంతాల నుంచి కూడా వేలి ముద్రల కోసం ఏవో కార్యాలయానికి వచ్చి వెనుదిరిగారు.

వేలిముద్రలు వేద్దామని వచ్చా..



వేలిముద్రలు వేద్దామని వచ్చా. సచివాలయానికి వెళ్తే పెడనకు వెళ్లాలని సూచించారు. దీంతో పెడనకు వచ్చా. ఇక్కడ ఎవరూ లేరు. తాళం వేసి ఉంది. గతంలో కూడా వేలిముద్రలు వేయాలని వస్తే ఇప్పుడు కాదని పంపించేశారు. తీరా ఇప్పుడు వస్తే తాళం వేసి ఉంది. ఈ విధంగా తిప్పించుకోవడం ఏమిటో అర్థం కావడం లేదు. అంత దూరం నుంచి రావాలంటే ఛార్జీలు అధికమవుతున్నాయి. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– కొల్లు మమత, ఉప్పలకలువగుంట, పెడన

అందుబాటులో ఉంటుందేమోనని వచ్చా



మా ప్రాంతంలోని సర్వర్ లభించక ఆలస్యమవుతుంది. అందువల్ల పెడనలో వేద్దామని వచ్చా. త్వరగా పని అవుద్దనుకుంటే ఇక్కడ ఎవరూ లేరు. చాలా మంది రైతులు వచ్చి వెళ్లిపోతున్నారు. వారితో పాటే మేం కూడా. సిబ్బంది ఉండి ఉంటే వేలిముద్రలు వేద్దామనుకున్నాం.

– పెద్దారెడ్డి సతీష్‌కుమార్, సాతులూరు, బంటుమిల్లి మండలం

300 మంది రైతుల వేలి ముద్రలే సేకరించమన్నారు



మండలంలో 300 మంది రైతుల నుంచి మాత్రమే వేలి ముద్రలు సేకరించాలని సోమవారం మధ్యాహ్నం సమాచారం వచ్చింది. అంతకు ముందు అందరి రైతుల నుంచి వేలిముద్రలు సేకరించాం. సిబ్బంది లేని కారణంగా కొద్దిగా ఇబ్బందిగా ఉంది.ఇన్‌చార్జిగా పెడన, మడకలకు ఎవరినీ వేయలేదు. తాజా సమాచారంతో 300 మంది రైతుల నుంచి మాత్రమే కాబట్టి ఇబ్బంది లేకుండా ప్రతి రైతుసేవా కేంద్రం పరిధిలోని వేలిముద్రలు తీసుకోవాల్సిన రైతుల జాబితాలను మాత్రమే ప్రదర్శించి రైతులకు సమాచారం ఇచ్చి వేలిముద్రలను సేకరిస్తాం.

– నూరున్నీసా, ఇన్‌చార్జి ఏవో, పెడన మండలం

యోగాసనాలు చేసి ఆరోగ్యవంతులు అవ్వండి

కలెక్టర్ బాలాజీ



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు

మచిలీపట్నంటౌన్: జిల్లా ప్రజలు యోగా శిక్షణ తరగతులలో పాల్గొని ఆరోగ్యవంతులు కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఏపీ యోగాసభ మచిలీపట్నం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీనగర్‌లోని ఉదయపు నడక మిత్రమండలి భవనంలో నిర్వహిస్తున్న యోగాశిక్షణ తరగతుల్లో పాల్గొని యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ యోగాంధ్ర టీ షర్టులను అభ్యాసకులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి 18వ తేదీ వరకు జిల్లాలో అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో యోగా ట్రైనర్ల ద్వారా యోగా శిక్షణ తరగతులు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో యోగా గురువులు ఘంటసాల గురునాథ్ బాబు, ఆర్‌డీ ప్రసాదు పలువురు అభ్యాసకులు పాల్గొన్నారు.

యోగాంధ్ర బ్యానర్, కరపత్రాల ఆవిష్కరణ

మాతృమూర్తి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ముద్రించిన యోగాంధ్ర బ్యానర్, కరపత్రాలను కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మాతృమూర్తి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా చేపట్టిన సేవా కార్యక్రమాల ఫొటో ఆల్బమ్‌ను ఆయన తిలకించారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను విడుదల చేసి సభ్యులను అభినందించారు. స్టార్ కళాశాల ప్రతినిధి శ్రీరామ్, మాతృమూర్తి సేవా ట్రస్ట్ ఫౌండర్ మల్లిఖార్జునుడు, సత్యనారాయణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం

మచిలీపట్నంటౌన్: బాలికలు యోగ సాధన చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని మచిలీపట్నం ఆర్డీఓ కే స్వాతి పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలోని లేడీ ఆంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 600 మంది విద్యార్థినులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. యోగ గురువు ఎం.శాస్త్రి, ఇంటర్ మీడియెట్ ప్రాంతీయ తనిఖీ అధికారి సాల్మన్ రాజు ఈ యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థినులతో భ్రమరి ప్రాణాయామం, కపాలభాతి, ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ స్వాతి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ బాలికలు యోగా సాధన చేయడం వలన ఋతు క్రమం సక్రమంగా జరుగుతుందన్నారు. విద్యార్థినులు ధ్యానం చేయడం వలన ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లంకెలపల్లి హరినాథ్, కళ్యాణి, స్పందన తదితరులు పాల్గొన్నారు. లేడీ ఆంప్తిల్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కే స్వాతి, ఇంటర్మీడియెట్ అధికారి వృక్షాసనం వేయడం విశేషం.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాసనాలు చేస్తున్న ఆర్డీఓ స్వాతి

యోగా చేస్తే మంచి ఫలితాలు

పెడన: విద్యార్థి దశ నుంచే యోగాసనాలు చేస్తే ఆరోగ్యపరంగా చాలా మంచిదని పెడన ఎంఈవో-2 వైవీ హరనాథ్ అన్నారు. సోమవారం స్థానికంగా ప్రాథమిక (బంగ్లాస్కూలు)పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. యోగా ట్రైనర్ గిరిధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యోగాసనాల వల్ల ఫలితాలను తెలియజేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఎ.భాగ్యలక్ష్మి, దాతలు మట్టా రాధాకృష్ణమూర్తి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ సుధారాణి, వైస్ చైర్మన్ బాబు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను జయప్రదం చేయాలి

మోపిదేవి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 19వ తేదీ నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం జయప్రదం చేయాలని స్థానిక తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పలుశాఖల అధికారులతో కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మోపిదేవి జెడ్పీపాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎంపీడీవో జె.స్వర్ణభారతి, ఎంపీపీ రావి దుర్గావాణి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, ఈవో పీఆర్డీ త్రిపుర సుందరి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, వైద్య, విద్యాశాఖ అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మండలాన్ని ఆక్వాజోన్‌గా ప్రకటించాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ గరుడ ప్రసాద్



ఆక్వాజోన్‌పై ఎఫ్‌డీవోతో మాట్లాడుతున్న ఎంపీపీ గరుడప్రసాద్

కృత్తివెన్ను: తీరప్రాంతమైన కృత్తివెన్ను మండలాన్ని ఆక్వాజోన్‌గా ప్రకటించి, ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మత్స్యశాఖ అధికారులతో మాట్లాడుతూ మండలంలోని భూములు సారవంతమైన నేలలు కాకపోవడం, సరైన పంటలు పండక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతాన్ని ఆక్వాజోన్ చేయడం వల్ల ప్రభుత్వం నుంచి ఆక్వాసాగుకు విద్యుత్ సబ్సిడీ, రుణాలు, చెరువుల తవ్వకాలకు సులభంగా అనుమతులు వస్తాయన్నారు. దీనిపై ఎఫ్‌డీవో నాగాంజని సమాధానమిస్తూ మండలంలో 17,300 ఎకరాలలో ఆక్వాసాగు ఉందని, ఇప్పటికే 9 వేల ఎకరాలను ఆక్వాజోన్‌గా గుర్తించామన్నారు. మరో 6,300 ఎకరాలకు ప్రపోజల్స్ పంపినట్లు తెలిపారు. కాలువకు నీటిని విడుదల చేస్తున్నారని ఇరిగేషన్ ఏఈఈ రాజ్యలక్ష్మి చెప్పారు. జెడ్పీటీసీ మైల రత్నకుమారి మాట్లాడుతూ ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. శాఖల వారీగా నివేదికలు వినిపించారు. వైస్ ఎంపీపీ గూట్ల శిరీషా, కార్యాలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు, ఎంపీటీసీలు,సర్పంచ్‌లు,అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలి

గూడూరు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. సభకు అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా గూడూరులోని దాదాపు 200 మంది లబ్ధిదారులకు పటాన్‌పేటలో నివేశన స్థలాలు మంజూరు చేశారన్నారు. అయితే భూమిపై కొంత మంది కోర్టుకు వెళ్లడంతో లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసినప్పటికీ ఇళ్లు నిర్మించుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయాలకు వెళ్తే ఇప్పటికే పట్టాలు మంజూరు చేసినట్లు వస్తోందని వారు ఆందోళన చెందుతున్నారన్నారు. అలాంటి వారందరికీ ఇళ్ల పట్టాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దారు డి.రాజ్యలక్ష్మిని కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దారు మాట్లాడుతూ వారందరూ నివేశనస్థలాలు పొందటానికి అర్హులే అన్నారు. వివిధ శాఖలపై సభలో సమీక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, ఈఓపీఆర్డీ బి.రాజేశ్వరి, ఏఓ కె.వి.రామకృష్ణ, మోటేపల్లి వనజ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంచారజాతుల పిల్లల్ని బడిలో చేర్పించాలి

చల్లపల్లి: ఆధార్ కార్డులు లేకపోవటంతో 12 సంవత్సరాలు దాటినప్పటికీ సంచార జాతుల పిల్లలు పాఠశాలలకు వెళ్లి చదువుకోలేకపోతున్నారని, వారికి చదువు చెప్పిచ్చేందుకు అధికారులు చొరవ చూపాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు కోరారు. స్థానిక కోమలాటాకీస్ ఎదురుగా ఉంటున్న మూడు కుటుంబాలకు చెందిన సంచార జాతుల పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిసి సురేష్‌బాబు తహసీల్దార్ డి.వనజాక్షిని కలిసి పరిస్థితి వివరించారు. ఆధార్ కార్డులు లేకపోవటం వల్ల పిల్లలు చదువుకు దూరమవటమేకాక కొన్ని కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు కూడా అందటంలేదని చెప్పారు. వారిలో సరైన చైతన్యం లేకపోవటం, వారి జీవన స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ నిబంధనలను సడలించి సంచార జాతుల ప్రజల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని సురేష్‌బాబు కోరారు. బాలలకు కనీస విద్యాబుద్ధులు, సేంక్షమం అందేలా ప్రతి ఒక్కరూ చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్లిలలకు నివాస, జనన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు కృషిచేస్తానని తహసీల్దార్ వనజాక్షి చెప్పినట్లు సురేష్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చల్లపల్లి: 400 కేవీ విద్యుత్ లైన్ల ఆధునికీకరణ పనుల కారణంగా అవనిగడ్డ, గుడివాడ, పామర్రు, మచిలీపట్నం, చిగురుకోట విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు డీఈఈ కృష్ణ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 400 కేవీ వేమగిరి- సత్తెనపల్లి లైన్ నుంచి ప్రతిపాదిత 400 కేవీ గుడివాడ వరకు కొత్త ట్రాన్స్‌మిషన్ల స్ట్రింగింగ్ పనులు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల గుడివాడలోని 220 కేవీ విద్యుత్ లైన్లకు విద్యుత్ సరఫరా తాత్కాలిక అంతరాయం ఏర్పడుతుందన్నారు. అయితే సాధారణ ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, తప్పనిసరి అయితే తప్ప పైన తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదు.

ప్రశాంతంగా మెగా డీఎస్సీ పరీక్ష



డీఎస్సీ పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మెగా డీఎస్సీ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.రాజారమేష్, అడ్మిన్ పి. అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు 180 మందికి గాను 165 మంది హాజరయ్యారని, 15 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి గాను 174 మంది హాజరయ్యారని, ఆరుగురు ఆబ్సెంట్ అయ్యారన్నారు. రెండు సెషన్స్‌లలో 360 మందికి గాను 339 మంది హాజరవ్వగా 21 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష జరిగిందని పేర్కొన్నారు.

వైభవంగా ముగిసిన ఉర్వేళమ్మ జాతర



అర్ధరాత్రి వేళ ఉర్వేళమ్మ ఆలయంలో సంబరం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో మూడేళ్లకు ఒకసారి నిర్వహించే గ్రామదేవత ఉర్వేళమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం అర్ధ రాత్రి వరకు సాగిన గుడి సంబరాలు వైభవంగా ముగిశాయి. గత మూడు రోజులుగా జరిగిన పోతురాజు పోత, మదార్ సాహెబ్ ఊరేగింపు, గుడారం సంబరం, మద్దిరావమ్మ సంప్రదాయ సంబరం తదితర ఆధ్యాత్మిక వేడుకలు ముగియడంతో ఆదివారం రాత్రి పది గంటల నుంచి ఉర్వేళమ్మ పూజ, గుడి సంబరం జరిగింది. తొలుత 20 ముఠాల పెద్దల పర్యవేక్షణలో గ్రామస్తులు దీపజ్యోతుల అలంకారంతో కూడిన వేడి నైవేద్యాలను తలలపై పెట్టుకుని భారీ ఊరేగింపుగా ఉర్వేళమ్మ ఆలయంలో సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. యూత్ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన కేరళ సంప్రదాయ కళాకారులు ప్రదర్శించిన చండీమేళం(సింగేరి మేళం) విన్యాసాలు జాతరలో ఆకట్టుకుంది. డీజే సౌండ్లతో యువత సందడి సృష్టించారు. అవనిగడ్డ సీఐ పి.యువకుమార్, నాగాయలంక ఎస్.ఐ కలిదిండి రాజేష్ నేతృత్వంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, ఆయా ముఠా పెద్దలు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'మీకోసం'లో రెండు అర్జీలు స్వీకరణ



తహసీల్దారు అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

పెడన: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మీకోసం కార్యక్రమానికి రెండు ఆర్జీలను అందజేశారు. పెనుమల్లి గ్రామం నుంచి 20 ఏళ్ల కిందట వెళ్లిపోయి విజయనగరంలో స్థిరపడ్డ నిడుమోలు శ్రీనివాస్ మైగ్రేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్‌ను వినతిపత్రం అందజేరు. దీనిపై అనిల్‌కుమార్ స్పందిస్తూ కేవలం ఎస్టీ, ఎస్సీలకు మాత్రమే మైగ్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తారని, మిగిలిన సామాజిక వర్గాల వారికి అవసరం లేదన్నారు. ఇదే విషయాన్ని విజయనగరం తహసీల్దారుతో పాటు వీఆర్వోతో కూడా ఫొన్లో తెలిపారు. కులధ్రువీకరణ పత్రం జారీ చేయొచ్చని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల కోసం బీసీ బీ కుమ్మరి కులధ్రువీకరణ పత్రం అవసరం కావడంతో అక్కడ దరఖాస్తుచేస్తే మైగ్రేషన్ సర్టిఫికెట్ కావాలని అధికారులు కోరారన్నారు. మీరుండే ప్రాంతం నుంచి తెచ్చుకోవాలని చెప్పడంతో తాను ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. విజయనగరం తహసీల్దారుతో నేరుగా ఇక్కడి తహసీల్దారు మాట్లాడి సమస్యను పరిష్కరించారని, అక్కడకు వెళ్లి కులధ్రువీకరణ పత్రం తీసుకుంటానని పేర్కొన్నారు. తన పొలం ఆక్రమణలకు గురవుతుందని, చర్యలు తీసుకోవాలని మరో ఆర్జీ వచ్చినట్లు అధికారులు తెలిపారు.

గుర్రపుడెక్కడ తొలగింపు పనుల పరిశీలన



చిల్లల వాగులో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

దేవరకోట(ఘంటసాల): డ్రెయినేజీలు, పంట కాలువల అభివృద్ధి పనులను వేగవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో డ్రెయినేజీలు, పంట కాలువల్లో ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ నిధులతో తూటికాడ, గుర్రపుడెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఘంటసాల, చల్లపల్లి మండలాల్లోని వేములపల్లి, యార్లగడ్డ, వక్కలగడ్డ, చల్లపల్లి, పుచ్చగడ్డ, దేవరకోట వరకు 12 కి.మీ ప్రవహించే ఆయకట్టు మురుగును గుండేరులో కలిపే చిల్లల వాగు మైనర్ డ్రెయినేజీలో స్ప్రేయింగ్ పనులను శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు, యువనేత మండలి వెంకట్రామ్, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, బాషా, తదితరులు ఉన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలుశిక్ష, జరిమానా

నూజివీడు: బాకీ తీర్చే నిమిత్తం ఇచ్చిన చెక్కు బ్యాంకులో చెల్లని నేరానికి గాను కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన మేకల శ్రీకాంత్ కుమార్‌కు రూ.9 లక్షల జరిమానా, ఏడాది జైలుశిక్ష విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. 2021 మే 21న చాట్రాయి మండలం చిత్తపూర్‌కు చెందిన గంగుల నాగమారేశ్వరరావు అనే వ్యక్తి శ్రీకాంత్ కుమార్‌కు రూ.7 లక్షలు అప్పుగా ఇచ్చాడు. కొంతకాలం గడిచిన తరువాత బాకీ చెల్లించమని అడగ్గా శ్రీకాంత్‌కుమార్ రూ.7 లక్షలకు నాగమారేశ్వరరావుకు చెక్కు ఇచ్చాడు. ఈ చెక్కును బ్యాంకులో వేయగా శ్రీకాంత్ కుమార్ ఖాతాలో నగదు లేదని చెక్కు తిరిగి వచ్చింది. విచారణఅనంతరం శ్రీకాంత్‌కుమార్‌కు జరిమానా, జైలుశిక్ష విధిస్తూ స్పెషల్‌మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు.

మత్స్యకారుల మృతి బాధాకరం

అవనిగడ్డ: అంతర్వేది వద్ద జరిగిన బోటు ప్రమాదంలో దివిసీమకు చెందిన ఇద్దరు మత్స్యకారులు మృత్యువాత పడిన ఘటన తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రమాదంలో నాగాయలంక మండలం గుల్లలమోదకు చెందిన నాగిడి రాము, సంగమేశ్వరంకు చెందిన తమ్ము పోతు రా జు గల్లంతై ప్రాణాలు కోల్పోవడం బాధాకరమ న్నా రు. ప్రభు త్వ సహా యం అందేలా కృషిచేస్తానన్నారు.కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.